

బట్టబయలైన అక్రమ బాగోతం!

స్వల్ప వివాదం కారణంగా గ్రానైట్ అక్రమ రవాణా బాగోతం బట్టబయలైంది. ఎస్పీ దామోదర్‌కు గురువారం బాధితులు ఫిర్యాదు చేశారు.

- 8లో..



విగ్రహాన్ని తీయండి ప్లీజ్.!

చౌటపాలెం గ్రామస్తులతో పోలీసులు చర్చలు జరిపారు. మంత్రి స్వామి, టీడీపీ నేతల తీరుతో నిమజ్జనం నిలిచిపోయిన వినాయక విగ్రహాన్ని తీయాలని కోరారు.

- 8లో..

గరిష్టం/కనిష్టం
38.4/28.2

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

జిల్లా రిజిస్ట్రార్‌గా బాలాంజనేయులు

- ఇక్కడ పనిచేస్తున్న ఉపేంద్ర విశాఖపట్నంకు బదిలీ



నూతన రిజిస్ట్రార్ బాలాంజనేయులు

ఒంగోలు సబర్బన్: స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ జిల్లా రిజిస్ట్రార్‌గా ఏ బాలాంజనేయులును నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా రిజిస్ట్రార్లను బదిలీ చేశారు. నెల్లూరు జిల్లా రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న బాలాంజనేయులును ప్రకాశం జిల్లాకు కేటాయించారు. బాలాంజనేయులు గతంలో మార్కాపురం జిల్లా రిజిస్ట్రార్ పరిధిలో కంభం సబ్ రిజిస్ట్రార్‌గా విధులు నిర్వర్తించారు. ఒంగోలు జిల్లా రిజిస్ట్రార్ పరిధిలోని పలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో కూడా ఆయన పనిచేశారు. ఒంగోలు జిల్లా రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న టి.ఉపేంద్రను విశాఖపట్నం జిల్లా రిజిస్ట్రార్‌గా బదిలీ చేశారు. ఉపేంద్ర గురువారం విధుల నుంచి రిలీవ్ అయ్యారు. నూతన రిజిస్ట్రార్‌గా బాలాంజనేయులు శుక్రవారం బాధ్యతలు చేపట్టనున్నట్లు ఒంగోలు జాయింట్-1 సబ్ రిజిస్ట్రార్ సీహెచ్ శ్రీనివాసరావు తెలిపారు.

22న జిల్లా స్థాయి యోగాసన పోటీలు

ఒంగోలు: యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ అనుబంధ సంస్థ అయిన యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ప్రకాశం జిల్లా ఆధ్వర్యంలో ఈ నెల 22వ తేదీ ఉదయం 8 గంటల నుంచి యోగాసన పోటీలు నిర్వహించనున్నట్లు అసోసియేషన్ కార్యదర్శి సోమా సుబ్బారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ఒంగోలు సరస్వతి శిశు మందిర్‌లో పోటీలు జరుగుతాయన్నారు. సబ్ జూనియర్ కేటగిరి (10-14 సంవత్సరాలు), జూనియర్ కేటగిరి (14-18), సీనియర్ కేటగిరి (18-28), సీనియర్ ఏ కేటగిరి (28-35), సీనియర్ బీ కేటగిరి (35-45), సీనియర్ సీ కేటగిరి (45-55 సంవత్సరాలు)లో పోటీలు నిర్వహిస్తారన్నారు. ట్రెడిషనల్ ఈవెంట్, ఆర్టిస్ట్ సోలో, ఆర్టిస్ట్ పెయిర్ విభాగాలలో అన్ని కేటగిరీలకు పోటీలు జరుగుతాయని, ఎంపికైన వారు రాష్ట్ర స్థాయిలో పోటీపడాల్సి ఉంటుందని అన్నారు. పూర్తి వివరాలకు 7780680121, 9490163312 సెల్ నంబర్లను ఈ నెల 21వ తేదీలోపు సంప్రదించి రిజిస్ట్రేషన్ పొందాలని సూచించారు.

23న ఎస్‌జీఎఫ్ క్రీడా జట్ల ఎంపిక

ఒంగోలు: ఎస్‌జీఎఫ్ అండర్-14, అండర్-17 క్రీడా జట్లను ఈ నెల 23వ తేదీ ఉదయం 9 గంటల నుంచి స్థానిక డీఆర్ఆర్ఎం ఉన్నత పాఠశాల ఆవరణలో ఎంపిక చేయనున్నట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి కె.వనజ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాకు చెందిన బాలబాలికలు మాత్రమే ఈ ఎంపికలో పాల్గొనేందుకు అర్హులని చెప్పారు. ఉమ్మడి జిల్లాల పరిధిలోని పీఈటీ/పీడీలు ఆసక్తి కలిగిన విద్యార్థులతో ఆన్‌లైన్‌లో ఎంట్రీ చేయించి మాన్యువల్ ఎంట్రీఫాంతో ఎంపికకు హాజరయ్యేలా చూడాలన్నారు. అండర్-17 కేటగిరీలో పాల్గొనే ఇంటర్ విద్యార్థులు పదో తరగతి మార్కుల జాబితా, ఆధార్‌కార్డు, జ్ఞానభూమి చైల్డ్ ఐడీ నంబరు, సంబంధిత ప్రిన్సిపాల్ ధ్రువీకరణ పత్రాన్ని నిర్వాహకులకు సమర్పించాలని, పూర్తి వివరాలకు సెల్ నంబర్ 9494941401ను సంప్రదించాలని సూచించారు.

30న అండర్-19 జట్ల ఎంపిక...

ఉమ్మడి ప్రకాశం జిల్లా పరిధిలో అండర్-19 స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా జట్లను ఈ నెల 30వ తేదీ సింగరాయకొండలోని ఏఆర్‌సీ అండ్ జీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కాలేజీ ఆవరణలో ఎంపిక చేయనున్నట్లు అండర్-19 ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి చింపారెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు ఎంపిక ప్రారంభమవుతుందన్నారు. వాలీబాల్, కబడ్డీ, షటిల్, టెన్నికాయిట్, తైక్వాండో క్రీడల్లో జిల్లా జట్ల ఎంపిక జరుగుతుందన్నారు. ఉమ్మడి ప్రకాశం జిల్లా పరిధిలోని జూనియర్ కాలేజీలలో చదివే విద్యార్థులు పాల్గొనవచ్చన్నారు. 2006 జనవరి 1వ తేదీ నాటికి జన్మించిన వారు మాత్రమే అర్హులన్నారు. క్రీడాకారులు ధ్రువీకరణ పత్రాలు సమర్పించి ఎంపికకు హాజరుకావాలన్నారు. పూర్తి వివరాలకు 9848125706 సెల్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

మహిళలకు ఉచితంగా కంప్యూటర్ శిక్షణ

ఒంగోలు టౌన్: జిల్లాలోని మహిళలకు కంప్యూటర్ ట్యాలీలో ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు రూడ్‌సెట్ సంస్థ డైరెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 18 నుంచి 45 సంవత్సరాల వయసు కలిగిన గ్రామీణ ప్రాంత మహిళలు ఈ శిక్షణకు అర్హులని చెప్పారు. జిల్లాలో రేషన్ కార్డు, ఆధార్ కార్డు కలిగి ఉండాలన్నారు. శిక్షణ కాలంలో ఉచితంగా భోజనం, వసతి సౌకర్యం కల్పించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు 82473 87644 నంబర్‌కు ఫోన్ చేసి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

'మార్కాపురాన్ని జిల్లా చేస్తా.. వెలిగొండ ప్రాజెక్టును ప్రారంభించింది నేనే.. నీళ్లు కూడా ఇస్తా.. పేపరు పరిశ్రమ తెస్తా' అంటూ టీడీపీ అధినేత చంద్రబాబు హామీల వర్షం కురిపించారు.

'నల్లమల అటవీ ప్రాంతాన్ని, కంభం చెరువును టూరిజం హబ్‌గా మారుస్తా'.. జనసేన అధినేత పవన్ కల్యాణ్ గిద్దలూరు పర్యటనలో హామీలిచ్చారు.

'జిల్లాను గుండెల్లో పెట్టుకుని చూసుకుంటా.. ఫార్మాహబ్‌గా మారుస్తా.. కనిగిరి ప్రాంతంలో వలసలు అపేందుకు ప్రత్యేక ప్రణాళిక.. ఫ్లోరైడ్ సమస్యకు శాశ్వత పరిష్కారం.' యువగళం పాదయాత్ర సందర్భంగా జిల్లాలో పలు ప్రాంతాల్లో నారా లోకేశ్ ఇచ్చిన హామీ.

కూటమి సమర్పించిన.. మడతెట్టేశారు..



సార్వత్రిక ఎన్నికల సమయంలో కూటమి నేతలు నారా చంద్రబాబు, పవన్ కల్యాణ్, నారా లోకేష్ జిల్లాలో పర్యటించారు. అలవికాని హామీలెన్నో ఇచ్చారు. ఏవేవో హామీలిచ్చేశారు. ప్రజల్ని బుట్టలో వేసేసుకున్నారు. ఎప్పటిలాగే వంచించారు. అధికారంలోకి వచ్చాక నాలుక మడతపెట్టేశారు. అధికారంలోకి వచ్చి వందరోజులు పూర్తయినా ఒక్కటంటే ఒక్క హామీపై కూడా దృష్టి సారించిన పాపాన పోలేదు. ఇక సూపర్ సిక్స్‌పై యూటర్న్ తీసుకున్నారంటూ ప్రజల నుంచి పెద్ద ఎత్తున విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. హామీల అమలుపై దృష్టిసారించలేదు సరికదా ఇసుక, మట్టి, గ్రావెల్ మాఫియాలు తయారై విచ్చలవిడిగా సహజ వనరుల దోపిడీకి శ్రీకారం చుట్టారు. ఊరూరా రెడ్ బుక్ రాజ్యాంగం, పంచాయతీ నుంచి కలెక్టరేట్ వరకు.. పోలీస్ స్టేషన్ నుంచి ఎస్పీ కార్యాలయం వరకు తమ్ముళ్లు చెప్పిందే వేదంగా మారింది.

- ఎన్నికల వేళ మోసపూరిత హామీలు
- అధికారంలోకి వచ్చాక ప్రజల ఆశలపై నీళ్లు
- ప్రభుత్వం ఏర్పడి వంద రోజులైనా అమలుకాని వాగ్దానాలు
- వందరోజుల విజయాలంటూ.. ఆర్భాటపు ప్రచారానికి ప్రయత్నాలు
- ప్రజల నుంచి పెద్ద ఎత్తున విమర్శలు

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: సార్వత్రిక ఎన్నికల సమయంలో కూటమి పార్టీల అభ్యర్థుల విజయాన్ని కోరుతూ టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు, జనసేన అధినేత పవన్ కళ్యాణ్, నారా లోకేష్ దశల వారీగా జిల్లాలో పర్యటించారు. సభలు, సమావేశాలు నిర్వహించారు. ఎన్నెన్నో అబద్ధపు హామీలిచ్చారు. ఆచరణకు, అమలుకు వీలుకాని హామీలిచ్చి ఎప్పటిలాగే ప్రజల్ని మోసం చేశారు. అధికారంలోకి వచ్చాక సూపర్ సిక్స్‌లో ఒక్క హామీ కూడా అమలు చేయలేదు. ఎన్నికల సమయంలో చంద్రబాబు మార్కాపురం, ఒంగోలు, సంతనూతలపాడు, కనిగిరి, దర్శి నియోజకవర్గాల్లో ప్రచార సభలు నిర్వహించారు. యువగళం పేరుతో నారా లోకేష్ కొండపి, కనిగిరి, మార్కాపురం, సంతనూతలపాడు, ఒంగోలు నియోజకవర్గాల్లో పర్యటించారు. పవన్ కల్యాణ్ గిద్దలూరు నియోజకవర్గానికి మాత్రమే పరిమితమయ్యారు. నాడు వారు ఇచ్చిన హామీలపై నేడు అధికారంలోకి వచ్చిన తర్వాత పట్టించుకున్న దాఖలాలు కనిపించడం లేదు.

ఎన్నికల ప్రచార సభలో వారు ఇచ్చిన హామీలు ఇలా...

టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు మార్చి 31, మే 3వ తేదీల్లో మార్కాపురం నియోజకవర్గంలో పర్యటించారు. మార్కాపురం పాత బస్టాండ్, పొదిలి పట్టణంలో బహిరంగ సభలు నిర్వహించారు. అధికారంలోకి రాగానే 'వెలుగొండ ప్రాజెక్టును ప్రారంభించి కచ్చితంగా నీళ్లిచ్చేలా చూస్తా.. ఆర్ఆర్ ప్యాకేజీ అమలుచేస్తా.. అప్పట్లో ప్రారంభించింది నేనే.. నీళ్లు ఇచ్చేది కూడా నేనే' అంటూ హామీలిచ్చారు.



మార్కాపురం సభలో చంద్రబాబు (ఫైల్)

మార్కాపురాన్ని జిల్లాను చేసి మీ కలను నెరవేరుస్తా.. వెలిగొండ ప్రాజెక్టును పూర్తిచేసి వెంటనే నీళ్లిస్తా.. పొదిలి పెద్దచెరువుకు సాగర్‌నీటిని నింపి నీటి సమస్య తీరుస్తా.. పేపర్ పరిశ్రమను ఏర్పాటుచేస్తా.. రామాయపట్నం పోర్టు ద్వారా యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తా.. ల్యాండ్ టైటిల్ యాక్టు రద్దు చేస్తా.. మహిళలను లక్షాధికారులను చేస్తా.. అంటూ హామీలు గుప్పించారు. అయితే అధికారంలోకి వచ్చి 100 రోజులైనా అటు వెలిగొండ, ఇటు మార్కాపురం జిల్లాపై ఎటువంటి ప్రకటనలు లేకపోవడంపై కూటమి ప్రభుత్వ తీరును ఈ ప్రాంత ప్రజలు విమర్శిస్తున్నారు.

జిల్లా ఎప్పుడు చేస్తారో...

అధికారంలోకి వచ్చిన వెంటనే మార్కాపురాన్ని జిల్లా చేస్తానని చంద్రబాబు నాయుడు మార్కాపురం, పొదిలిలో జరిగిన ప్రజాగళం బహిరంగ సభల్లో ఇచ్చిన హామీని ప్రజలు బలంగా నమ్మారు. ఇప్పటి వరకూ జిల్లా ఊసేలేదు. మార్కాపురం, యర్రగొండపాలెం, గిద్దలూరు, దర్శి, కనిగిరి ప్రాంతాలను కలుపుతూ జిల్లా ఏర్పాటైతే పశ్చిమ ప్రకాశంలో వెనుకబాటుతనం పోతుంది. అభివృద్ధి పథకాలకు ప్రత్యేక నిధులొస్తాయని ప్రజలు ఆశపడ్డారు. వారి ఆశలు అడియాశలుగా మారనున్నాయి.

ఒక్క హామీ అయినా గుర్తుందా బాబూ..?

ఎన్నికల ప్రచారంలో భాగంగా కనిగిరి పట్టణంలో ఈ ఏడాది జనవరి 5వ తేదీ చంద్రబాబు పర్యటించారు. అధికారంలోకి రాగానే వెలిగొండ ద్వారా కృష్ణా జలాలను కనిగిరి ప్రాంత ప్రజలకు అందిస్తామన్నారు. కనిగిరిలో ట్రిపుల్ ఐటీ కళాశాలను ప్రారంభిస్తామన్నారు. నిమ్జ్‌ను పూర్తి చేస్తామంటూ హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు దాటినా.. ఒక్క దానిపై కూడా దృష్టి సారించలేదు. 2014లో అధికారంలో ఉన్న సమయంలోనూ కనిగిరికి మొండిచెయ్యే చూపారని ప్రజలు మండిపడుతున్నారు.

గుండ్లకమ్మకు ప్రత్యేక నిధులు...

చంద్రబాబు సంతనూతలపాడు నియోజకవర్గానికి వచ్చినప్పుడు నియోజకవర్గంలోని మద్దిపాడు మండలంలో గుండ్లకమ్మ రిజర్వాయర్‌ను సందర్శించారు. రిజర్వాయర్ టెయిల్‌ఎండ్ ప్రాంతాల వరకు నిధులు కేటాయించి ఆయకట్టు చివరి భూముల రైతులందరికీ రిజర్వాయర్ ద్వారా సాగునీరు అందిస్తామని హామీ ఇచ్చారు. రిజర్వాయర్‌ను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు నిధులు కేటాయిస్తానన్నారు.

దర్శిలో ఇంటర్నేషనల్ డ్రైవింగ్ స్కూలును ప్రారంభిస్తా...

దర్శి పట్టణంలో మే 4వ తేదీ చంద్రబాబు బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇచ్చిన హామీలు ఇలా.. దర్శిలో ఇంటర్నేషనల్ డ్రైవింగ్ స్కూల్‌ను తాము అధికారంలోకి రాగానే ప్రారంభిస్తాం. గోదావరి-కృష్ణా అనుసంధానం చేసి దర్శి నియోజకవర్గంలో ప్రతి ఇంటికీ తాగునీరు, మూడు పంటలకు సాగునీరు అందిస్తాం. సాగర్ ఆయకట్టు చివరి భూములకు కూడా నీరిస్తాం. తాళ్లూరులో మొగిలిగుండాల చెరువును రిజర్వాయర్‌గా మారుస్తాం. నడికుడి - శ్రీకాళహస్తి రైల్వేలైన్ బాధ్యత నాదే. పెద ఉయ్యాలవాడలో ముసిపై వంతెన నిర్మిస్తాం. బొట్లపాలెం వద్ద దోర్నపు వాగుపై ఓవర్ బ్రిడ్జ్ పూర్తి చేస్తాం. దొనకొండను పారిశ్రామిక కేంద్రంగా అభివృద్ధి చేయడమే కాకుండా నియోజకవర్గంలో యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తాం. రాగముక్కపల్లెలో నిలిచిన ఎంఎస్ఎంఈ ప్రాజెక్ట్ పూర్తి చేస్తాం. చందవరం బ్రిడ్జి వద్ద అప్రోచ్ రోడ్డు నిర్మిస్తాం. గుండ్లకమ్మ ఎగువ నీటిని మల్కాపురం వద్ద లిఫ్ట్ చేసి ముండ్లమూరు, తాళ్లూరు మండలాలకు సరఫరా చేస్తాం.. అంటూ ఇచ్చిన హామీలపై దృష్టి సారించలేదుగానీ.. రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని మాత్రం అమలు చేస్తున్నారు.

ఓట్లు దండుకునేందుకు 'పవన్' వరాలు

సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా మే 3వ తేదీ గిద్దలూరులో జనసేన అధినేత పవన్ కళ్యాణ్ బహిరంగ సభ నిర్వహించారు. గిద్దలూరు మండలంలోని గుండ్లమోటుకు తెలుగుగంగ ప్రాజెక్ట్ నీటిని అనుసంధానం చేస్తామన్నారు. కంభం చెరువును పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసి ఎంతో మంది యువతకు ఉపాధి కల్పిస్తామని తెలిపారు. గిద్దలూరు ప్రాంతంలో నల్లమల అడువులు ఉన్నాయని, ఈ ప్రాంతాన్ని టూరిజం హబ్‌గా తీర్చిదిద్దడం, నియోజకవర్గ అభివృద్ధి బాధ్యత తీసుకుంటానని చెప్పారు. సూపర్‌సిక్స్ హామీలను ఒక్కొక్కటి చదివి వినిపించారు. యువతకు పరిశ్రమల ఏర్పాటుకు తోడ్పాటునందిస్తామన్నారు.



గిద్దలూరు సభలో మాట్లాడుతున్న పవన్ కల్యాణ్ (ఫైల్)

దోచుకోవడంపైనే దృష్టి...

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజల సంక్షేమాన్ని గాలికొదిలేసింది. హామీల అమలుపై కనీసం స్పందించలేదు. ప్రజాప్రతినిధుల నుంచి నాయకుల వరకూ అందరూ దోచుకోవడంపై దృష్టి సారించారు. ఇసుక, మట్టి, బియ్యం, గ్రానైట్‌ను అక్రమంగా రవాణా చేసి జేబులు నింపుకుంటున్నారు. అధికారాన్ని అడ్డం పెట్టుకుని జిల్లా దాటించేస్తున్నారు. కిందిస్థాయి నుంచి ఉన్నత స్థాయి అధికారుల వరకూ కూడా టీడీపీ నేతలు పచ్చ జెండా ఊపనిదే పోస్టింగులు దక్కని పరిస్థితి. గతంలో వలంటీర్లు స్వచ్ఛందంగా అందించిన సేవలు సైతం నేడు ఖరీదైపోయాయి. దర్శి, మార్కాపురం, కొండపి, తదితర నియోజకవర్గాల్లో రెడ్‌బుక్ రాజ్యం అమలు జరుగుతోంది. పోలీసులు సైతం అధికార పార్టీ నేతల చేతుల్లో కీలుబొమ్మలుగా మారారన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.

మెడికల్ కళాశాలకు గ్రహణం..

మార్కాపురాన్ని జిల్లా చేయడం మాట అటుంచితే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో చేపట్టిన మెడికల్ కళాశాల పనులకు కూటమి ప్రభుత్వం అడ్డుపుల్ల వేసింది. ఈ ఏడాది నుంచే అడ్మిషన్లు ప్రారంభం కావాల్సి ఉండగా దానిని సైతం అడ్డుకుంది. ప్రైవేటు పరం చేయాలన్న దురుద్దేశంతో పనులను సైతం మొక్కుబడిగా నిర్వహిస్తున్నట్టు సమాచారం. ప్రభుత్వ నిర్ణయం ఫలితంగా పేద విద్యార్థులు వైద్య విద్యకు దూరం కానున్నారు.

ఫ్లోరైడ్‌కు శాశ్వత పరిష్కారమన్న లోకేష్...

యువగళం పాదయాత్ర సందర్భంగా లోకేష్ కనిగిరి నియోజకవర్గంలో పర్యటించారు. ఈ సందర్భంగా పలు హామీలిచ్చారు. అధికారంలోకి వచ్చిన వెంటనే వలసలు ఆపేందుకు ప్రత్యేక ప్రణాళిక అమలు చేస్తాం.. వెలిగొండ ప్రాజెక్టు పూర్తి చేసి పిల్ల కాలువల ద్వారా సాగునీరు అందిస్తాం.. ఫ్లోరైడ్ సమస్యతో ప్రజలు పడుతున్న బాధలు నేను చూశాను.. ఫ్లోరైడ్ సమస్యకు శాశ్వత పరిష్కారానికి టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే వాటర్ గ్రిడ్ పథకం ద్వారా ప్రతి ఇంటికి కుళాయి ద్వారా సురక్షిత తాగునీరు అందిస్తాం.. కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న వారి కోసం అన్ని వసతులతో కూడిన డయాలసిస్ సెంటర్లు ఏర్పాటు చేస్తాం. అవసరమైన మేరకు డాక్టర్లను నియమిస్తాం.. నిమ్మ, బత్తాయి, పొగాకు రైతుల కష్టాలు నాకు తెలుసు.. మీ పెట్టుబడి తగ్గించి గిట్టుబాటు ధర కల్పిస్తాం.. టిడ్కో ఇళ్లు పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేస్తాం.. అంటూ ఎన్నో హామీలిచ్చారు. కానీ, నేడు వాటిని పట్టించుకున్న పాపాన పోలేదు. అలాగే చీమకుర్తి, సంతనూతలపాడు, ఒంగోలు మీదుగా మద్దిపాడు వరకు యువగళం పాదయాత్ర సాగింది. ఒంగోలు ఏ-1 ఫంక్షన్ హాలు ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో గ్రానైట్ ఫ్యాక్టరీల యజమానులతో సమావేశం నిర్వహించారు. పారిశ్రామికవేత్తలు ఎంత ఎక్కువ ఉత్పత్తి సాధించి ఎంత ఎక్కువ మందికి ఉద్యోగాలు కల్పిస్తే.. ఉద్యోగాల కల్పనను బట్టి పారిశ్రామిక రాయితీలు అందిస్తానని లోకేష్ భరోసా ఇచ్చారు. గ్రానైట్ పరిశ్రమను ఆదుకుంటామని హామీ ఇచ్చారు.



ఒంగోలు యువగళం సభలో మాట్లాడుతున్న లోకేష్(ఫైల్)

ఇక ప్రచార డప్పు..

- చంద్రబాబు వంద రోజుల పాలనలో చేసింది శూన్యం
- సూపర్ సిక్స్ పథకాలకు సున్నం
- వలంటీర్లకు ఎసరు
- చిరుద్యోగుల తొలగింపు
- గ్రామాల్లో వేధిస్తున్న ఇసుక కొరత
- జ్వరాలతో అల్లాడుతున్న ప్రజలు
- ఏదో సాధించినట్లు ప్రజావేదిక పేరుతో నేటి నుంచి ఆర్భాటపు ప్రచారానికి శ్రీకారం
- గ్రామాల్లోకి వెళ్లేందుకు జంకుతున్న ప్రజాప్రతినిధులు, అధికార యంత్రాంగం



కూటమి ప్రభుత్వ ప్రజావేదిక కరపత్రం...

కనిగిరి రూరల్: కూటమి ప్రభుత్వం ఏర్పడి 100 రోజులు పూర్తి కావడంతో ఏదో సాధించినట్లు ఆర్భాటపు ప్రచార కార్యక్రమాలకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఈ నెల 20 నుంచి 26వ తేదీ వరకు వారం రోజుల పాటు ప్రజావేదిక.. గ్రామ పర్యవేక్షణ పేరుతో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనుంది. అధికారులను కూడా భాగస్వాములను చేస్తూ ప్రతి పంచాయతీకి ఒక అధికారిని ప్రత్యేక అధికారిగా నియమిస్తూ ప్రజాప్రతినిధులు ఆయా గ్రామాల్లో ప్రజావేదిక కార్యక్రమాల్లో పాల్గొనే విధంగా ఆదేశాలిచ్చింది. అధికారులను ఇంటింటికి తిరిగి కరపత్రాలను సైతం పంపిణీ చేసి ప్రచారం చేయాలని సూచించింది.

ఆందోళనలో అధికారులు.. జంకుతున్న ప్రజాప్రతినిధులు...

కూటమి ప్రభుత్వం ఏర్పడి వందరోజులైనా చంద్రబాబు, కూటమి నేతలు రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన ఒక్క హామీ కూడా అమలు చేయలేదు. ఎన్నికలకు ముందు ఆర్భాటంగా ప్రచార చేసిన సూపర్ సిక్స్‌లో ఒక్కటి కూడా అమలుకు నోచుకోలేదు. ఇటీవల త్వరలో ఉచిత గ్యాస్ పథకం అంటూ ప్రచారాలు గుప్పిస్తున్నా.. అమలయ్యేంత వరకు ప్రజలు విశ్వసించే పరిస్థితి లేదు. ఈ నేపథ్యంలో వంద రోజుల పాలనపై ఇంటింటికి వెళ్తే.. తల్లికి వందనం ఎక్కడ.? పెట్టుబడి సాయం ఎప్పుడిస్తారు..? ప్రతి మహిళకు నెలకు రూ.1500 ఏవీ.? ఉచిత బస్సు ఏమైంది..? యువతకు ఉద్యోగాలేవి..? ప్రతి ఇంటికి 3 ఉచిత గ్యాస్ సిలిండర్లు ఎప్పుడిస్తారంటూ సూపర్ సిక్స్‌పై ప్రజలు నిలదీసే అవకాశం ఉంది. కనీసం పలానా అభివృద్ధి చేశామని నియోజకవర్గంలోగానీ, గ్రామాల్లోగానీ చూపించుకునే, చెప్పుకునే పరిస్థితి లేదు. దీంతో అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రజావేదిక కార్యక్రమంపై తీవ్రస్థాయిలో ఆందోళన చెందుతున్నారు.

స్థానిక సమస్యలతో అధికారులకు తలపోటు...

సూపర్ సిక్స్ మోసం పక్కన పెడితే.. స్థానిక సమస్యలు వెంటాడుతున్నాయి. గ్రామాల్లో విషజ్వరాలతో ప్రజలు అల్లాడుతున్నారు. ఏ గ్రామంలో చూసినా ఏముంది గర్వకారణం అన్నట్లు అనేక పంచాయతీల్లో పారిశుధ్య సమస్యలు వేధిస్తున్నాయి. గత ప్రభుత్వంలో జగనన్న ఆరోగ్య సురక్ష పేరిట అనేక చోట్ల వైద్య శిబిరాలు నిర్వహించి అక్కడే పరీక్షలు చేశారు. ప్రత్యేక వైద్యులతో చికిత్స కూడా చేయించారు. ప్రస్తుతం 100 రోజుల కూటమి ప్రభుత్వంలో గ్రామాల్లో వైద్య శిబిరాలు కరువయ్యాయి. జ్వర పీడితులు మరీ ఎక్కువగా ఉన్నట్లు ఎక్కడైనా వైద్యశాఖకు సమాచారం వస్తే అక్కడ మొక్కుబడిగా వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి అరకొరగా ఉన్న మందులతో మమ అనిపించారు. నేటికీ ఉచిత ఇసుక విధానం అమలు జరగలేదు. గ్రామాల్లో భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి లేక అల్లాడుతున్నారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రతి శాఖలో చిరుద్యోగులపై ప్రతాపం చూపారు. ఉపాధి హామీ పథకం మేస్త్రీ దగ్గర నుంచి పాఠశాలల్లో అన్నం పెట్టే వంట మనుషులు, ఆయాలు, వాచ్‌మెన్‌లను సైతం వదలకుండా అందర్నీ అధికారపార్టీ నేతలు ఆయా శాఖల మండల స్థాయి అధికారులపై ఒత్తిడి తెచ్చి ఏదో వంకతో తొలగించారు. ఆయా స్థానాల్లో టీడీపీ అనుయాయులను పెట్టించారు. ఇక, కూటమి ప్రభుత్వం రాగానే వలంటీర్లకు జీతాలు పెంచుతామని, ఉద్యోగ భద్రత కల్పిస్తామని చెప్పిన చంద్రబాబు.. అధికారంలోకి రాగానే లక్షలాది మంది వలంటీర్లను తొలగించారు. దీంతో ఇంటింటికి తిరిగి స్వచ్ఛందంగా ప్రభుత్వ సేవలు అందించే వలంటీర్లు నిరుద్యోగులుగా మారారు. ఎందరో లబ్ధిదారులు కొత్త రేషన్ కార్డులు, కొత్త పింఛన్ల కోసం ఎదురు చూస్తున్నారు. ఏప్రిల్ నెలలో ఎన్నికల నోటిఫికేషన్ తర్వాత ఇప్పటి వరకు ఆ వెబ్‌సైట్ తెరుచుకోలేదు. టీడీపీ ప్రభుత్వం ఏర్పడి మూడు నెలలు దాటినా నేటికీ సైట్ తెరుచుకోకపోవడంతో రేషన్ కార్డుల కోసం, కొత్త పింఛన్ల కోసం అర్హులైన లబ్ధిదారులు సచివాలయాల చుట్టూ.. కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. పింఛన్ల కోసం వృద్ధులు, వికలాంగులు, వితంతువులు ఎదురు చూస్తున్నారు. ఇలా అనేక సమస్యలు స్థానికంగా ఉండటంతో అధికారులు ఏ సమస్యపై ఎక్కడ ప్రజలు తమపై తిరగబడతారోనని ఆందోళన చెందుతున్నారు.

నేడు సీఎం చంద్రబాబు రాక

నాగులుప్పలపాడు: కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజులైన సందర్భంగా నేటి నుంచి రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు సీఎం నారా చంద్రబాబునాయుడు శుక్రవారం జిల్లాకు రానున్నారు. నాగులుప్పలపాడు మండలంలోని మద్దిరాలపాడు గ్రామంలో సాయంత్రం ఈ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. ఆకస్మికంగా నిర్ణయించిన ఈ కార్యక్రమం ఏర్పాట్లను గురువారం రాత్రి కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఎస్పీ దామోదర్ అధికారులు, సిబ్బందితో కలిసి పరిశీలించారు. చదలవాడలోని రవిప్రియ విల్లాలో ఉన్న హెలీప్యాడ్ వద్దకు మధ్యాహ్నం 2 గంటలకు సీఎం రానున్నట్లు సమాచారం. కార్యక్రమం అనంతరం సాయంత్రం 4 గంటలకు అదే హెలీప్యాడ్ నుంచి తిరుగు ప్రయాణం అవుతారని అధికారులు తెలిపారు. ఏర్పాట్ల పరిశీలనలో వ్యాపారవేత్త కంది రవిశంకర్, తహసీల్దార్ ప్రవీణ్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.



సీఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ, అధికారులు

పవన్ కళ్యాణ్ – లోకేష్ మధ్య లుకలుకలు

- త్వరలోనే కూటమి కుప్పకూలడం ఖాయం
- రాజ్యసభ మాజీ సభ్యుడు తులసిరెడ్డి

ఒంగోలు టౌన్: ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు, విద్యాశాఖామంత్రి నారా లోకేష్‌కు మధ్య పొంతన కుదరడం లేదని, కూటమి ప్రభుత్వంలో అప్పుడే లుకలుకలు మొదలయ్యాయని రాజ్యసభ మాజీ సభ్యుడు, కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి ఎస్.తులసిరెడ్డి విమర్శించారు. ఒంగోలు నగరంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో డీసీసీ అధ్యక్షుడిగా షేక్ సైదా బాధ్యతల స్వీకరణ సభలో గురువారం ఆయన మాట్లాడారు. కూటమి ఎక్కువ రోజులు ఉండదని, త్వరలోనే కుప్పకూలడం ఖాయమని తేల్చి చెప్పారు. చంద్రబాబు ప్రభుత్వం 100 రోజుల్లోనే ఘోరంగా విఫలమైందని విమర్శించారు. సూపర్ సిక్స్ హామీలిచ్చి అధికారంలోకి వచ్చారని, నేటికి వంద రోజులు దాటినా సామాజిక పింఛన్లు మినహా ఏ ఒక్కటీ అమలు చేయలేదని అన్నారు. రానున్న రోజుల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం కానుందని చెప్పారు. కార్యక్రమంలో ఇండియా కూటమి నాయకులు, ఆప్ నాయకులు పాల్గొన్నారు.



డీసీసీ అధ్యక్షుడిగా సైదాతో ప్రమాణం చేయిస్తున్న తులసిరెడ్డి

విద్యుత్ కోసం రైతుల ఆందోళన

గత ప్రభుత్వంలో పగలే 9 గంటలిచ్చారు..

ఇప్పుడెందుకు ఇవ్వడం లేదని అన్నదాతల నిలదీత

పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన



విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద గుమిగూడిన రైతులు

కురిచేడు: వ్యవసాయ విద్యుత్ సరఫరా వేళలు సక్రమంగా లేవని కురిచేడు మండలంలోని కాటంవారిపల్లె, పేరంబొట్లపాలెం గ్రామాల రైతులు గురువారం రాత్రి సబ్‌స్టేషన్‌ను ముట్టడించారు. ఎండలు మండుతుండటంతో పంటలు వాడిపోతున్నాయని, నీరందించి కాపాడుకునేందుకు విద్యుత్ సరఫరా సక్రమంగా ఉండటం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వంలో 9 గంటల విద్యుత్‌ను పగలే నిరంతరాయంగా ఇచ్చారని, ఇప్పుడెందుకు సమస్య వస్తోందని రైతులు ప్రశ్నించారు. ఉన్నతాధికారులు స్పందించి పగటిపూటే నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయాలని రైతులు కోరారు.

స్వల్ప వివాదం
బట్టబయలైన అక్రమ బాగోతం!

- యథేచ్ఛగా సాగుతున్న అక్రమ గ్రానైట్ రవాణా
- బిల్లులు లేకుండా చీమకుర్తి నుంచి అనంతపురం వెళ్తున్న లారీలు
- చిన్నారికట్ల జంక్షన్ వద్ద లారీలను ఆపిన వ్యక్తులపై డ్రైవర్ దాడి
- దగ్గరుండి మరీ బిల్లులు లేని లారీలను పంపిన పొదిలి ఎస్సై
- న్యాయం చేయాలని ఎస్పీ దామోదర్‌కు బాధితుల ఫిర్యాదు
- ఈ నెల 12న టీ–ట్యాక్స్ గ్రానైట్ లారీల బాగోతంపై 'సాక్షి'లో కథనం..



ఎస్పీకి ఇచ్చిన ఫిర్యాదు కాపీని చూపుతున్న శ్రీనివాసరెడ్డి, దినేష్‌రెడ్డి తదితరులు

మార్కాపురం: ఓ చిన్న వివాదం అక్రమ గ్రానైట్ బాగోతాన్ని బట్టబయలు చేసింది. చీమకుర్తి బ్లాక్ గ్రానైట్‌ను బిల్లులు లేకుండా లారీల్లో యథేచ్ఛగా తరలిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారన్న విషయంపై ఈ నెల 12న ‘సాక్షి’ ప్రచురించిన కథనం అక్షర సత్యమని రుజువైంది. వివరాల్లోకి వెళ్తే.. అక్రమంగా గ్రానైట్ తరలిస్తున్న లారీలను ఆపి ప్రశ్నించినందుకు తమపై దాడి చేశారని, న్యాయం చేయాలని కోరుతూ పొదిలికి చెందిన రాచమల్లు శ్రీనివాసరెడ్డి, అంబటి దినేష్‌రెడ్డి, యక్కంటి వెంకటరెడ్డి, మోరా శ్రీకాంత్‌రెడ్డి గురువారం ఒంగోలులో ఎస్పీ దామోదర్‌కు ఫిర్యాదు చేశారు.

వివాదం ఇదీ..

రాచమల్లు శ్రీనివాసరెడ్డి, అంబటి దినేష్‌రెడ్డి, యక్కంటి వెంకటరెడ్డి, మోరా శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పొదిలిలో లారీలను బాడుగకు తిప్పుతూ జీవిస్తున్నారు. ఈనెల 16వ తేదీ రాత్రి 8.40 గంటల సమయంలో పొదిలి సమీపంలోని చిన్నారికట్ల జంక్షన్ వద్ద ఉండగా ఏపీ 02 టీబీ 8879 నంబరు గల లారీ నంద్యాల వైపు వెళ్తోంది. తెలిసిన వారు లోడ్ తీసుకెళ్తున్నారని భావించి లారీని ఆపి ఎక్కడికి వెళ్తుందో అడిగారు. ‘చీమకుర్తి నుంచి తాడిపత్రికి గ్రానైట్ తీసుకెళ్తున్నాం. బిల్లులు కూడా లేవు. మాకు అడ్డువస్తే లారీతో తొక్కించి చంపుతాం’ అంటూ డ్రైవర్ ఇనుప రాడ్డుతో కొట్టినట్లు శ్రీకాంత్‌రెడ్డి ఎస్పీకి ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. అక్కడే ఉన్న మోరా రాజశేఖర్‌రెడ్డి, రాచమల్లు శ్రీనివాసరెడ్డి మరికొంత మంది వచ్చి తప్పించకపోతే చంపేసేవారని చెప్పారు. అదే సమయంలో అక్కడికి వచ్చిన పొదిలి ఎస్సై వేమన తనతోపాటు రాజశేఖర్‌రెడ్డి, మరికొంత మందిని కాళ్లతో తన్ని, చెంపమీద కొట్టారని, పర్మిట్ లేని గ్రానైట్ లారీని అక్కడి నుంచి పంపించారని ఆరోపించారు. బిల్లులు లేకుండా చీమకుర్తి నుంచి గ్రానైట్‌తో వెళ్తున్న ఏపీ 27 టీజెడ్ 2156 నంబరు గల మరో లారీని కూడా ఎస్సై అక్కడి నుంచి పంపేసినట్లు తెలిపారు. ఆ తర్వాత తమను పొదిలి పోలీసుస్టేషన్‌కు తీసుకెళ్లి నిర్బంధించారని వివరించారు. దీనిపై సమగ్రంగా విచారించి తమకు న్యాయం చేయాలని, నిందితులపై చర్యలు తీసుకోవాలని శ్రీకాంత్‌రెడ్డి తదితరులు ఎస్పీని కోరారు.



ఈ నెల 16న పర్మిట్ లేకుండా గ్రానైట్ తరలిస్తున్న లారీ

అధికారులు జీ హుజూర్..

టి–ట్యాక్స్ (తెలుగుదేశం ట్యాక్స్) చెల్లిస్తున్న గ్రానైట్ కంటైనర్ల జోలికి వెళ్లొద్దంటూ అధికార పార్టీ మంత్రులు, ఎమ్మెల్యేలు ఇస్తున్న ఆదేశాలకు పోలీసులు, మైనింగ్ శాఖ, విజిలెన్స్ అధికారులు జీ హుజూర్ అంటున్నారనేందుకు చిన్నారికట్ల వద్ద జరిగిన ఘటనే నిదర్శనం. బిల్లులు లేని లారీలను ఆపితే తమ ఉద్యోగాలకు ఎసరొస్తుందన్న భయం అధికారులను వెంటాడుతోంది. ఇటీవల నెల్లూరు మీదుగా చెన్నై వైపు వెళ్తున్న కంటైనర్‌ను ఆపిన సీఐపై ఆ జిల్లాకు చెందిన టీడీపీ నేతలు తీవ్ర స్థాయిలో ఒత్తిడి చేయడంతో చేసేది లేక వదిలేశారు.

ఒకటే బిల్లు.. 40 కంటైనర్లు!

వైఎస్సార్ సీపీ హయాంలో వ్యాపారులకు ఇబ్బంది కలగకుండా, ప్రభుత్వానికి ఆదాయం తెచ్చిపెట్టిన శ్లాబ్ సిస్టంను కూటమి ప్రభుత్వం తుంగలో తొక్కింది. పొరుగు రాష్ట్రాలకు వెళ్లే ఒక్కో కంటైనర్ రాష్ట్ర ప్రభుత్వానికి రాయల్టీ, జీఎస్టీ కింద రూ.40 వేలు చెల్లించాల్సి ఉండగా కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఒక కంటైనర్‌కు బిల్లు తీసుకుని దానిపైనే 40 లారీలను తరలిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. ఇలా తమిళనాడు, తెలంగాణాకు రోజుకు 150 కంటైనర్లు అక్రమంగా తరలిపోతున్నాయని విశ్వసనీయ సమాచారం. రోజూ అక్రమ రవాణాదారులు ఒక్కో కంటైనర్‌కు రూ.15 వేల లెక్కన.. అంటే సుమారు రూ.కోటిన్నర టీడీపీ నేతలకు టీ–ట్యాక్స్ రూపంలో కప్పం కడుతున్నట్లు జోరుగా చర్చ నడుస్తోంది. ప్రభుత్వానికి రాయల్టీ రూపంలో రావాల్సిన రూ.వందల కోట్ల సొమ్మును టీడీపీ నేతలు స్వాహా చేస్తున్నట్లు ట్రాన్స్‌పోర్ట్ వర్గాలు బహిరంగంగానే వ్యాఖ్యానిస్తున్నాయి.



గ్రానైట్ అక్రమ రవాణాపై ఈ నెల 12న సాక్షిలో ప్రచురించిన కథనం

ట్రావెల్ బస్సు ఢీకొని వ్యక్తి మృతి

- త్రుటిలో ఆయిల్ ట్యాంకర్‌ను తప్పించుకున్న ట్రావెల్ బస్సు



సంతోష్‌ను చూసి రోదిస్తున్న బంధువులు



బస్సు ఢీకొనడంతో రన్‌వేపై పడిన మోటార్‌సైకిల్



ప్రమాద తీవ్రతను పరిశీలిస్తున్న ఎస్సై మహేంద్ర

సింగరాయకొండ: ట్రావెల్ బస్సు ఢీకొన్న ఘటనలో మోటార్‌సైకిలిస్టు కొమ్ము సంతోష్(28) మృతి చెందాడు. ఈ సంఘటన గురువారం ఉదయం జరిగింది. ఈ ఘటనలో ట్రావెల్ బస్సు అదుపు తప్పి ఎదురుగా వస్తున్న ట్యాంకర్‌ను ఢీకొనే ప్రయత్నంలో ట్యాంకర్ డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించడంతో ఘోర ప్రమాదం తప్పింది. పోలీసుల కథనం ప్రకారం..కలికవాయ ఫ్లైఓవర్ సమీపంలో విమానాల రన్‌వే పక్కన టంగుటూరుకు చెందిన కొమ్ము సంతోష్ టిఫిన్ బండి నడుపుకుంటున్నాడు. ఈ క్రమంలో సమీపంలోని మూలగుంటపాడు పంచాయతీ వెంకటేశ్వర కాలనీ వద్ద ఉన్న వాటర్ ప్లాంట్ నుంచి నీరు తెచ్చుకునేందుకు రెండు బబుల్స్ తీసుకుని మోటారుసైకిల్‌పై సర్వీసు రోడ్డు నుంచి వెళ్లకుండా రన్‌వే దాటే ప్రయత్నం చేశాడు. ఈ సమయంలో బెంగుళూరు నుంచి ఒంగోలు వైపు వేగంగా వెళ్తున్న ట్రావెల్స్ బస్సు అకస్మాత్తుగా అడ్డుగా వచ్చిన మోటారుసైకిల్‌ను ఢీకొట్టింది. ఆ తరువాత బస్సు అదుపు తప్పి అవతల వైపుగా వెళ్లి నెల్లూరు వైపు వెళ్లే వాహనాలను ఢీకొనే ప్రయత్నం చేసింది. ఆ సమయంలో నెల్లూరు వైపు వెళ్తున్న ఆయిల్ ట్యాంకర్ డ్రైవర్ పరిస్థితిని గమనించి అప్రమత్తమై బస్సును ఢీకొనకుండా జాగ్రత్త పడ్డాడు. దీంతో పెను ప్రమాదం తప్పింది. ట్యాంకర్‌ను ఢీకొని ఉంటే జరిగే ఘటనను ఊహించలేమని బస్సులోని ప్రయాణికులు ఆందోళనగా తెలిపారు. ఘటనలో మోటారుసైకిలిస్టు సంతోష్‌కు తీవ్ర గాయాలు కాగా అతనిని 108లో ఒంగోలు జీజీహెచ్‌కు తరలించగా తరువాత మెరుగైన వైద్యం కోసం ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై బి.మహేంద్ర తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఒంగోలు జీజీహెచ్‌కు తరలించి ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు. సంతోష్ ప్రైవేట్‌గా ఉద్యోగం చేసుకుంటూ ఉదయం ఖాళీ సమయంలో టిఫిన్ సెంటర్ నిర్వహిస్తున్నాడు. మృతునికి వివాహం కాలేదు. బస్సులోని ప్రయాణికులను వేరే బస్సుల్లో గమ్యస్థానానికి చేర్చారు.

మానేపల్లిలో ఇరువర్గాల ఘర్షణ



మానేపల్లి గ్రామంలో పోలీసుపికెట్

పుల్లలచెరువు: మండలంలోని మానేపల్లిలో బుధవారం ఇరువర్గాలు ఘర్షణకు దిగారు. ఈ ఘటనలో ఇద్దరు గాయపడ్డారు. వివరాల్లోకి వెళితే..మానేపల్లి గ్రామానికి చెందిన బైరెడ్డి నరసింహారెడ్డి అనే రైతు తన పొలంలో గట్ల వెంట గడ్డి ఉండడంతో గన్ సాయంతో మందు చల్లుతున్నారు. అదే పొలం పక్కనే ఉన్న రాంపోలయ్య వరినారుకు మందు చల్లాలని, గన్ ఇవ్వాలని కోరాడు. దీంతో నరసింహారెడ్డి గన్‌తో గడ్డి మందు కొడుతున్నానని, శుభ్రం చేసుకొని వాడాలని చెప్పారు. అయితే ఆ తరువాత రాంపోలయ్య వరినారుమడికి గన్‌తో మందు కొట్టగా నారంతా పాడైపోయింది. దీంతో ఇద్దరి మధ్య ఘర్షణ జరిగింది. గ్రామంలోని పెద్దలు ఇద్దరిని సముదాయించి పంపించారు. ఈ క్రమంలో బుధవారం సాయంత్రం రాంపోలయ్య కుమారుడు వచ్చి కుటుంబసభ్యులతో కలిసి నరసింహారెడ్డిపై కర్రలు, రాడ్‌లు, గొడ్డలితో దాడి చేశారు. దాడిలో ఇద్దరికి గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న నరసింహారెడ్డి బంధువులు రాంపోలయ్యతో ఘర్షణ పడ్డారు. దీంతో నరసింహారెడ్డి వర్గీయులు పుల్లలచెరువు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు వెళ్లారు. ఈ క్రమంలో రాంపోలయ్యకు చెందిన వినుకొండ మండలంలోని ఐనవోలు గ్రామానికి చెందిన 20 మంది యువకులు గ్రామంలోని మహిళలను దుర్భాషలాడటంతో వారు వ్యక్తికి దేహశుద్ధి చేశారు. విషయం పోలీసులకు తెలియడంతో డీఎస్పీ నాగరాజు, సీఐ ప్రభాకర్‌రావు సిబ్బందితో గ్రామానికి వచ్చి ఇరువర్గాలను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. గురువారం ఉదయం గ్రామానికి చెందిన అందరినీ సీఐ ప్రభాకరరావు పిలిపించి మాట్లాడారు. చిన్న చిన్న విషయాలకు గొడవలు పరిష్కారం కాదని, అందరూ కలిసిమెలిసి ఉండాలన్నారు. గొడవలు సృష్టిస్తే నాన్ బెయిలబుల్ కేసులు నమోదుచేస్తామని హెచ్చరించారు. ముందస్తు చర్యగా గ్రామంలో పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు. ఈయన వెంట యర్రగొండపాలెం ఎస్‌ఐ చౌడయ్య పాల్గొన్నారు.

విగ్రహాన్ని తీయండి ప్లీజ్..!

- చౌటపాలెం గ్రామస్తులతో పోలీసుల చర్చలు
- వినాయక నిమజ్జనం చేపట్టాలని వినతి
- అక్రమ కేసులు ఎత్తివేయాలని కోరిన గ్రామస్తులు



గ్రామస్తులతో చర్చిస్తున్న ఎస్సై రమేష్‌బాబు

పొన్నలూరు: మండలంలోని చౌటపాలెంలో మంత్రి స్వామి, టీడీపీ నేతల తీరుతో వినాయక నిమజ్జనం నిలిచిపోయింది. రాజకీయ కక్ష సాధింపుల్లో భాగంగా నిమజ్జనం జరగకుండా మంత్రి బాలవీరాంజనేయస్వామి పోలీసుల సహాయంతో అడ్డుకున్నారు. అయితే మంత్రి స్వామి, టీడీపీ నేతలు, పోలీసులు వ్యవహరించిన తీరుపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. ఈ క్రమంలో గ్రామస్తులను బెదిరించి, కేసులు బనాయించి పంతం నెగ్గించుకోవాలనుకున్నారు. కానీ కుదరకపోవడంతో టీడీపీ నేతలు, పోలీసులు దిగి వచ్చారు. దీంతో దిద్దుబాటు చర్యలకు దిగారు. ఈ క్రమంలో గురువారం పొన్నలూరు ఇన్‌ఛార్జి ఎస్సై రమేష్‌బాబు గ్రామస్తులను పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి చర్చలు చేశారు. అనంతరం గ్రామంలో మరోసారి మహిళలు, గ్రామస్తులతో మాట్లాడారు. వినాయక నిమజ్జనం జరగకపోవడంతో ప్రభుత్వానికి, పోలీసులకు చెడ్డ పేరు వస్తుందని, వెంటనే నిమజ్జనం కార్యక్రమం చేపట్టాలని గ్రామస్తులను కోరారు. దీంతో గ్రామస్తులు తమపై పెట్టిన అక్రమ కేసులు తీసివేయాలని, నిమజ్జనంలో పాల్గొనడానికి వచ్చిన బంధువులపై పెట్టిన కేసులు కూడా ఎత్తివేసి వారి ట్రాక్టర్లు, బైక్‌లు విడుదల చేయాలని కోరారు. అలాగైతేనే వినాయక బొమ్మను గ్రామంలో ఊరేగించకుండా నేరుగా నిమజ్జనానికి తరలిస్తామని గ్రామస్తులు స్పష్టం చేశారు. దీంతో ఎస్సై రమేష్‌బాబు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి తగు న్యాయం చేస్తామని చెప్పినట్లు గ్రామస్తులు తెలియజేశారు.

యూపీహెచ్‌సీ మహిళా అటెండర్‌కు వేధింపులు

- ఎస్పీకి ఫిర్యాదు చేసిన బాధితురాలు
- కేసు నమోదు చేయకుండా టీడీపీ నాయకుల ప్రయత్నాలు

ఒంగోలు టౌన్: ఒక మహిళా అటెండర్‌ను వేధిస్తున్న వైద్యశాల సిబ్బంది వ్యవహారం రచ్చగా మారింది. శాఖాపరమైన ఫిర్యాదులతో ప్రయోజనం లేకపోవడంతో బాధితురాలు పోలీసుస్టేషన్ గడపతొక్కింది. అయితే, కేసు నమోదు చేయకుండా టీడీపీ నాయకులు ప్రయత్నాలు చేస్తున్నారు. ఆ వివరాల్లోకెళ్తే.. ఒంగోలు నగరంలోని గోపాల్‌నగర్‌కు చెందిన సరోజ స్థానిక 9వ డివిజన్‌లోని రాజీవ్ గృహకల్ప కాలనీలో ఉన్న పట్టణ ఆరోగ్య కేంద్రం (యూపీహెచ్‌సీ)లో ఏడాదిన్నరగా అటెండర్‌గా పనిచేస్తోంది. భర్త లేకపోవడంతో తానే పిల్లలను పోషించుకుంటోంది. ఈ నేపథ్యంలో అదే వైద్యశాలలో పనిచేస్తున్న ల్యాబ్ టెక్నీషియన్ సురేంద్ర, కంప్యూటర్ ఆపరేటర్ షేక్ అన్సారీలు రెండు నెలలుగా ఆమెను వేధింపులకు గురిచేస్తున్నారు. అసభ్యంగా కామెంట్ చేస్తూ మానసికంగా హింసిస్తున్నారు. రోజూ మొక్కలకు నీరు పోస్తున్న సమయంలో కంప్యూటర్ ఆపరేటర్ ఆమెనుద్దేశించి ద్వంద అర్థాలతో కూడిన కామెంట్లు చేస్తున్నాడు. అలాగే సాయంత్రం 4 గంటల తర్వాత ఆస్పత్రిని శుభ్రం చేస్తున్నప్పుడు ల్యాబ్ టెక్నీషియన్ సురేంద్రతో కలిసి మద్యం సేవించి వచ్చి ఇబ్బంది పెడుతున్నాడు. దీనిపై వారం రోజుల క్రితం డీఎంహెచ్‌ఓకు బాధితురాలు ఫిర్యాదు చేసింది. ఆ విషయం తెలుసుకున్న వారిద్దరూ మరింత రెచ్చిపోయారు. మరింతగా వేధించడం మొదలుపెట్టారు. సహనం కోల్పోయిన సరోజ.. ఎస్పీ ఏఆర్ దామోదర్‌కు ఫిర్యాదు చేసింది. విచారణ చేయమని ఒంగోలు తాలూకా పోలీసులను ఎస్పీ ఆదేశించారు. అయితే, కేసు నమోదు చేయకుండా 9వ డివిజన్‌కు చెందిన ఇద్దరు టీడీపీ నాయకులు రంగ ప్రవేశం చేసినట్లు తెలుస్తోంది. సరోజ మానసిక పరిస్థితి బాగాలేదంటూ బాధితురాలి మీదనే వైద్యశాలలో పనిచేస్తున్న సిబ్బందితో ఫిర్యాదులు చేయించినట్లు సమాచారం. ఎలాగైనాసరే.. సరోజను విధుల నుంచి తొలగించి తమ మనిషిని నియమించుకునేందుకు కూడా సదరు టీడీపీ నాయకులు ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. ఈ విషయంపై డీఎంహెచ్‌ఓ డాక్టర్ సురేష్‌కుమార్‌ను వివరణ కోరగా, ఫిర్యాదు వచ్చిన మాట వాస్తవమేనని, సరోజ ఆరోపణలపై విచారణ చేస్తున్నామని తెలిపారు. తాలూకా సీఐ అజయ్‌కుమార్‌ను వివరణ కోరగా, సరోజ ఫిర్యాదుపై విచారణ జరుపుతున్నామని, గురువారం విచారణకు పిలవగా ఆమె హాజరుకాలేదని తెలిపారు. సరోజ మీద కూడా వైద్యశాల సిబ్బంది ఫిర్యాదు చేసి ఉన్నారని, ఏదేమైనా విచారణ తర్వాత తగిన చర్యలు తీసుకుంటామని సీఐ తెలిపారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు దుర్మరణం



చిల్లచెట్లలో రాళ్ల మధ్య పడి ఉన్న సుధీర్ మృతదేహం



మృతదేహం వద్ద విలపిస్తున్న మృతుని బంధువులు

మద్దిపాడు: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మద్దిపాడు ఎస్సీ కాలనీ సమీపంలో బుధవారం రాత్రి జరిగింది. బంధువులు తెలిపిన వివరాల మేరకు...కొనకనమిట్ల మండలం చింతగుంట్ల గ్రామానికి చెందిన ఆదిమూలం చినరాజు, సంతోషమ్మల కుమారుడు సుధీర్(27)కు మద్దిపాడు మండలం వల్లాయపాలెం గ్రామానికి చెందిన చెరువుపల్లి పోలయ్య, మరియమ్మ మూడో కుమార్తె చిట్టితో నాలుగేళ్ల క్రితం వివాహమైంది. సుధీర్ తెలంగాణలో మేడ్చల్‌లో బేల్దారీ మేస్త్రీగా పనిచేస్తూ జీవిస్తున్నాడు. నాలుగు రోజుల క్రితం కుటుంబసభ్యులంతా వల్లాయపాలెం వచ్చారు. ఈ నెల 18న పొదిలి బాప్టిస్ట్‌పాలెంకు చెందిన తన స్నేహితుడు సునీల్ వివాహానికి సుధీర్ వెళ్లాడు. వివాహ అనంతరం పూటుగా మద్యం సేవించి ద్విచక్రవాహనంపై అత్త గారి ఊరైన వల్లాయపాలెం బయలుదేరాడు. అయితే సుధీర్ ఇంటికి రాకపోవడంతో బంధువు వెతుకులాట ప్రారంభించారు. బుధవారం రాత్రి మద్దిపాడు ఎస్సీ కాలనీ సమీపంలో రోడ్‌పక్కనే ఉన్న మట్టిదిబ్బపైకి ద్విచక్రవాహనం ఎక్కడంతో ద్విచక్రవాహనం అదుతప్పి రోడ్ పక్కనే చిల్లచెట్ల మధ్య ఉన్న పెద్ద బండరాయి తలకు తగిలి తీవ్రగాయాలు కావడంతో మృతి చెందాడు. బంధువులు సంఘటనా స్థలానికి చేరుకొని విలపించారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పొదిలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

పేర్నమిట్టలో ట్రాక్టర్ ఢీకొని యువకుడు..

ఒంగోలు టౌన్: ట్రాక్టర్ డ్రైవర్ నిర్లక్ష్యం ఒక యువకుడి ప్రాణాలు బలిగొంది. ఒంగోలు తాలూకా పోలీసుల కథనం ప్రకారం.. పేర్నమిట్ట గ్రామానికి చెందిన ములతోటి భానుప్రసాద్(26) గురువారం రాత్రి 8 గంటల సమయంలో బైక్‌పై ఒంగోలు బయలుదేరాడు. ఈ క్రమంలో పేర్నమిట్ట బస్టాండ్ సెంటర్‌లో డౌన్ వద్దకు రాగానే సంతనూతలపాడు వైపు వేగంగా వెళ్తున్న ట్రాక్టర్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో భానుప్రసాద్ అక్కడికక్కడే మృతి చెందాడు. భానుప్రసాద్ ఇటీవలే ప్రేమ వివాహం చేసుకున్నాడు. రోడ్డు ప్రమాదంలో మరణించడంతో భార్య, తల్లి, కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరయ్యారు. మృతుడి సోదరుడు భరత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తాలుకా పోలీసులు తెలిపారు.



భానుప్రసాద్ మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

పూటుగా తాగి.. సాగర్ కాలువలో దూకి..

కురిచేడు: ఓ వ్యక్తి మద్యం మత్తులో నాగార్జున సాగర్ దర్శి బ్రాంచ్ కాలువలో దూకగా స్థానిక యువకుడు వేగంగా స్పందించి రక్షించాడు. ఈ సంఘటన కురిచేడు–దర్శి రోడ్డులో గురువారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం.. పల్నాడు జిల్లా నూజెండ్ల మండలం పాతనాగిరెడ్డి పల్లె గ్రామానికి చెందిన బి.వెంకటేశ్వర్లు మరో వ్యక్తితో కలిసి వచ్చి దర్శి రోడ్డులో కాలువ వద్ద వైన్ షాపులో మద్యం కొనుగోలు చేసి పూటుగా తాగాడు. ఆ తర్వాత వెంకటేశ్వర్లు పరుగెత్తుకుంటూ వెళ్లి కాలువలో దూకాడు. స్థానిక యువకుడు ఆవుల విష్ణువర్ధన్ రెడ్డి గమనించి వెంకటేశ్వర్లును రక్షించాడు. ఎస్సై శివ తన సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకుని వెంకటేశ్వర్లు ఆటోలో ఆస్పత్రికి తరలించారు. విష్ణువర్ధన్ రెడ్డిని స్థానికులు అభినందించారు.

వెన్నంపల్లిలో చోరీ

కొమరోలు: మండలంలోని వెన్నంపల్లె గ్రామంలో బుధవారం అర్ధరాత్రి దొంగలు రెచ్చిపోయారు. గ్రామానికి చెందిన రావిపాటి భాస్కర్‌రెడ్డి ఇంటి తాళం పగలగొట్టి 3.5 తులాల బంగారం, రూ.80 వేల నగదు దోచుకెళ్లారు. గురువారం తెల్లవారుజామున భాస్కర్‌రెడ్డి కుటుంబ సభ్యులు ఇంటికి చేరుకోగా తలుపులు తెరిచి ఉన్నాయి. దొంగలు పడినట్లు గుర్తించి స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. గిద్దలూరు రూరల్ సీఐ రామకోటయ్య సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న సీఐ రామకోటయ్య

జూడో జిల్లా జట్ల ఎంపిక

సింగరాయకొండ: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండలంలోని పాకల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం అండర్–14, 17 బాల బాలికల జూడో జిల్లా జట్ల ఎంపిక జరిగింది. జిల్లా స్కూల్ గేమ్స్ సెక్రటరీ డి.వనజ పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో జిల్లాలో వివిధ పాఠశాలలకు చెందిన 200 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వీరిలో ఉత్తమ ప్రతిభ కనబరచిన 33 మందిని జిల్లా జట్టుకు ఎంపిక చేశామని, వీరు త్వరలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని వ్యాయామ ఉపాధ్యాయుడు పిల్లి హజరత్తయ్య వివరించారు. వ్యాయామ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.